సాక్షి
వైఎస్సార్ జిల్లా

సోమవారం । 6 । జనవరి । 2025



మార్కెట్‌కు రంగుల కళ
సంక్రాంతి పండుగకు ముగ్గుల పండుగగా పేరుంది. ఇళ్ల ముందు కళ్లాపి చల్లి రంగు రంగుల ముగ్గులు తీర్చిదిద్దడం ఆనవాయితీగా వస్తోంది. -8లో



రాయలసీమ డిక్లరేషన్‌పై స్పందించాలి
రాయలసీమ డిక్లరేషన్‌పై బీజేపీ ప్రజా ప్రతినిధులు స్పందించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎం.ఎ. గఫూర్ డిమాండ్ చేశారు. -8లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం 28.9 /16.4
జిల్లాలో ఆదివారం 16.4 – 28.9 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

అంతర్జాతీయ సదస్సులో ఏఎఫ్‌యూ అధ్యాపకులు

ఏఎఫ్‌యూ: తిరునంతపురంలో శనివారం నిర్వహించిన భారతీయ శాస్త్రం, సంస్కృతం, వికసిత్ భారత్ కోసం నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సులో కడప నగరంలోని వైఎస్‌ఆర్ ఏఎఫ్‌యూ అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ సదస్సులో విశ్వవిద్యాలయం నుంచి జి. ఫణీంద్రారెడ్డి, శివకృష్ణారెడ్డి, నరాపురెడ్డి, నరసయ్య, నందురెడ్డి పాల్గొన్నారు.

స్థలం అక్రమ రిజిస్ట్రేషన్‌పై చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

ప్రొద్దుటూరు: 'మాజీ ఎమ్మెల్యే స్థలం అక్రమ రిజిస్ట్రేషన్' శీర్షికన శుక్రవారం సాక్షిలో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. తహసీల్దార్ గంగయ్య నకిలీ పత్రాలను పరిశీలించి మాజీ ఎమ్మెల్యే కుటుంబీకుడైన మాజీ కౌన్సిలర్ శౌరి సుభాష్‌రెడ్డితో చర్చించారు. అలాగే స్థలం వద్దకు వెళ్లి పరిశీలించారు. తాము పొజిషన్ సర్టిఫికెట్ ఇవ్వలేదని, దీనిపై విచారణ చేస్తామని తహసీల్దార్ తెలిపారు. ఈ స్థలం రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారందరని రూరల్ ఎస్‌ఐ మహ్మద్ రఫీ అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న వారిని గుర్తించి అక్రమ రిజిస్ట్రేషన్‌పై వివరాలు సేకరిస్తున్నారు.

మఠంలో అభివృద్ధి పనుల పరిశీలన



మఠంలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఆర్‌జేసీ చంద్రశేఖర్ ఆజాద్, వెంకటాద్రి, పిట్ పర్సన్

బ్రహ్మంగారిమఠం: ప్రముఖ పుణ్యక్షేత్రం బ్రహ్మంగారిమఠంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆదివారం దేవదాయ ధర్మదాయ శాఖ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్ పరిశీలించారు. స్థానిక దేవాలయం పరిధిలో అభివృద్ధిలో భాగంగా రెండు సమాధులను తొలగించారంటూ పూర్వపు పీఠాధిపతి సతీమణి మారుతి మాలక్ష్మమ్మ, మరి కొందరు స్థానిక పిట్ పర్సన్ శంకర్ బాలాజీపై ఫిర్యాదు చేశారు. ఈ మేరకూ ఆర్‌జేసీ పరిశీలన చేశారు. ఈ క్రమంలో మఠంలో అభివృద్ధి అధికంగా జరిగినట్లు స్థానికులు ఆర్‌జేసీ దృష్టికి తీసుకెళ్లారు. ఇదేక్రమంలో అభివృద్ధి పనుల్లో ప్రధానంగా పోలేరమ్మ గుడి ఆధునికీకరణ జరుగుతున్న పనులను పరిశీలించారు. పూర్వపు మఠాధిపతి కుమారులు వెంకటాద్రి, దత్తస్వామి తదితరులు పాల్గొన్నారు.

బాలసదన్ పిల్లలకు సుకన్య స్కీం

రాజంపేట: రాజంపేట పట్టణంలో ఉన్న బాలసదన్ పిల్లలకు సుకన్య స్కీం వర్తించేలా చర్యలు తీసుకోవాలని బాలసదన్ నిర్వాహకులను సబ్‌కలెక్టర్ వైఖోమ్ నైదియాదేవి ఆదేశించారు. శనివారం రాత్రి ఆమె బాలసదన్‌ను తనిఖీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మాతృప్రేమకు దూరమైన వారికి మాతృప్రేమను అందించేలా బాలసదన్ నిర్వహణ ఉండాలన్నారు. బాలసదన్‌లో ఉన్న వారిని కన్నపిల్లలుగా చూసుకోవాలన్నారు. వారిబాగోగుల విషయంలో నిర్లక్ష్యం వహించరాదని అన్నారు.


ఉత్సాహంగా మాస్టర్స్ బ్యాడ్మింటన్ పోటీలు



పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని వైఎస్‌ఆర్ ఇండోర్ స్టేడియంలో జిల్లాస్థాయి మాస్టర్స్ బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ప్రముఖ వైద్యులు డాక్టర్ మోహన్, గురుకుల్ విద్యాపీఠ్ డైరెక్టర్ వివేకానంద, జిల్లా బ్యాడ్మింటన్ సంఘం చైర్మన్ ఎస్. జిలానీబాషా, ఉపాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 35 ప్లస్ విభాగం నుంచి 65 ఏళ్ల వారికి నిర్వహిస్తున్న ఈ క్రీడాపోటీలు క్రీడాస్ఫూర్తిని చాటిచెబుతున్నాయన్నారు. ఆటలకు వయసుతో సంబంధం లేదని, ఆటపై ఉన్న ప్రేమే ఇందుకు నిదర్శనమన్నారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో సైతం మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. అనంతరం సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

దోచుకుంటున్నారు!



కూటమి నేతల భూ దోపిడీకి కొండలు నిలువునా కరుగుతున్నాయి.. గుట్టలు చూస్తుండగానే గుల్లవుతున్నాయి. ప్రభుత్వ భూములు రాత్రికి రాత్రే చదునవుతున్నాయి.. చెరువులు పచ్చ నేతల చేతుల్లో 'చిక్కి' పోతున్నాయి.. ఇక అక్రమ మైనింగులకు.. ఇసుక, మట్టి రవాణాకు అడ్డే లేకుండా పోయింది. అవును.. టీడీపీ అందలమెక్కాక.. ఆ నేతల అవినీతి అందనంత ఎత్తుకు ఎదిగింది. అధికారాన్ని ఒళ్లో పెట్టుకుని ఎంచక్కా జేబులు నింపుకుంటున్నా.. పగలు, రాత్రి దర్జాగా దోపిడీ చేస్తున్నా.. అధికారుల కళ్లకు 'మామూళ్ల మత్తేదో' అడ్డుపడినట్లుంది.

- అధికారం అండతోనేతల భూ దోపిడీ
- తెరపైకి వచ్చిన బద్వేల్ టీడీపీ నేత భూబాగోతం
- పరపతి ఆధారంగా ప్రకృతి సంపద దోపిడీ
- అగ్రభాగంలో ఉన్న కమలాపురం టీడీపీ నేత



గొందిపల్లె రెవెన్యూ పొలంలో పొక్లెయిన్ ద్వారా గ్రావెల్ లోడింగ్

సాక్షి ప్రతినిధి, కడప: బి.కోడూరు మండలం పాయలకుంట్ల పంచాయతీ పరిధిలోని వేమకుంట రెవెన్యూ పొలంలో సర్వే నెంబరు 18లో 16.75 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిపై టీడీపీ నేత కన్ను పడింది. అంతే రాత్రికి రాత్రే బోరు వేశారు. అందుకు అవసరమైన విద్యుత్ కోసం స్తంభాలు వెలిశాయి. ఎంచక్కా ప్రొక్లెయిన్‌తో భూమి చదును చేస్తున్నారు. దర్జాగా ప్రభుత్వ భూమి స్వాహా చేస్తున్నారు. తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జీ నేత కనుసన్నుల్లో రేయింబవళ్లు ఆక్రమణల పర్వం కొనసాగుతోంది. ప్రభుత్వ భూమి చదును చేస్తున్న వ్యవహారం పత్రికల్లో వెలుగుచూసినా రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడలేదు.

- కడప పరిసర ప్రాంతాల్లో అక్రమ మైనింగ్ కార్యకలాపాలు కూటమి ప్రభుత్వ ఏర్పడిన తర్వాత తీవ్రమైంది. చింతకొమ్మదిన్నె చెరువుతో ఆరంభమై, కొలుములపల్లె గ్రామంలోని పిచ్చమ్మగుట్టను గుల్ల చేశారు. ఆపై పబ్బాపురం చెరువును లూటీ చేసి పెండ్లిమర్రి మండలం గొందిపల్లె గుట్టలను చెరబట్టారు. కోట్లాది రూపాయాలు అక్రమార్జన యథేచ్ఛగా కొనసాగించినా అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరించారు. ఈమొత్తం ఉదంతం కమలాపురం టీడీపీ నేత కనుసన్నుల్లో నడిచింది.

- మైదుకూరు మండలం నంద్యాలంపేటలో సర్వేనంబర్ 859లో 16 ఎకరాలు, సర్వేనంబర్ 840లో ఏకంగా 70 ఎకరాలు ప్రభుత్వ భూమికి కంచె వెలిసింది. తిప్పిరెడ్డిపల్లె గోడేరు చెరువులో 50ఎకరాలు అన్యాక్రాంతమైంది. వల్లూరమ్మ చెరువు పేరుకు మాత్రమే ఉండిపోయింది. 30 ఎకరాల్లో ఉన్న చెరువు ప్రస్తుతం 2 ఎకరాలకు పరిమితమైంది. సర్వే నంబర్ 77లో 4ఎకరాలు కొండ పొరంబోకును చదను చేశారు. 138/సీలో కుంట పొరంబోకు 12 ఎకరాలు సబ్‌డివిజన్ చేయించుకొని పాసుబుక్‌లు కూడా తెచ్చుకున్నారు. సర్వే నంబర్ 742, 743లో జేసీబీలు పెట్టి అక్రమంగా చదును చేస్తున్నారు. ఇవన్నీ పట్టపగలే సాగుతున్నా... రెవెన్యూ యంత్రాంగం అధికార మత్తులో ఉండిపోయింది.

- ఇవే కాదు జిల్లాలో చెరువులు, గుట్టలు, వాగులు, వంకలు అక్రమార్జనకు కాదేదీ అనర్హం అన్నట్లుగా పచ్చ నేతలు కొల్లగొడుతున్నారు. అధికారమే ఏకైక పెట్టుబడిగా యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతున్నారు. ఓవైపు రాజకీయ ప్రత్యర్థుల ఆర్థిక మూలాలపై దెబ్బకొట్టడం, ఇంకోవైపు ఆర్థిక పరిపుష్టి పెంచుకునేందుకు అడ్డదారులు ఎంచుకున్నారు. ఈక్రమంలో వందలాది ఎకరాలు ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. అదే దినచర్యగా పెట్టుకుని సుప్రీంకోర్టు ఉత్తర్వులను సైతం పెడచెవిన పెడుతూ చెరువులను చెరబట్టారు. చివరికి స్వాతంత్య్ర సమరయోధుల కుటుంబాలకు కేటాయించిన భూమికి కూడా తిప్పలు తప్పడం లేదు. తాజాగా తిప్పిరెడ్డిపల్లెలో ఈ విషయం వెలుగుచూసింది. సర్వే నంబర్ 231లో స్వాతంత్య్ర సమరయోదులకు కేటాయించారు. చదును చేసుకునేందుకు ఖర్చులకు బయపడ్డ వారి కుటుంబసభ్యులు ఆ భూములను ఖాళీగా ఉంచారు. తాజాగా టీడీపీ నేతలు సదరు భూములను జేసీబీలతో చదును చేసి ఆక్రమణలో ఉంచుకున్నారు.

అధికారం అండతో అక్రమ మైనింగ్...



గ్రావెల్ లోడ్‌తో తరలివెళ్తున్న టిప్పర్

పెండ్లిమర్రి మండలం గొందిపల్లెలో సర్వే నంబర్ 480/1పి లో 17.8 హెక్టార్లు బెరైటీస్, డోలమైట్ మైనింగ్ లీజు వెల్లటూరుకు చెందిన వి వెంకటసుబ్బయ్య 2018లో దక్కించుకున్నారు. అందులో వైట్ బెరైటీస్ టన్నుకు రూ.1000, కలర్ బెరైటీస్ టన్నుకు రూ.200, డోలమైట్ టన్నుకు రూ.80 రాయల్టీ ఫీజు చెల్లించేలా ఉత్తర్వులున్నాయి. కాగా డోలమైట్ లేదా బెరైటీస్ మైనింగ్ చేయకుండా కేవలం ఆ ప్రాంతంలో ఎలాంటి రాయల్టీ ఫీజు చెల్లించకుండా గ్రావెల్ తరలిస్తూ సొమ్ము చేసుకున్నారు. చింతకొమ్మదిన్నె చెరువు, పిచ్చమ్మగుట్ట, పబ్బాపురం చెరువు ఇవన్నీ కూడా అక్రమ మైనింగ్ కొనసాగించారు. కోట్లాది రూపాయాలు అక్రమార్జన ఆర్జించేందుకు అధికారులు సహకరించారు. ఇప్పుడు అధికారికంగా ఇసుక లీజును అప్పగించారు. ఉచిత ఇసుక పేరుకు మాత్రమే అక్రమంగా బాహాటంగా తరలివెళ్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారని పలువురు వాపోతున్నారు.

పోటీ పడుతున్న తమ్ముళ్లు

ప్రకృతి సంపద ఆధారంగా అక్రమ ఆదాయం కోసం టీడీపీ నేతలు పోటీ పడుతున్నారు. అందుకు అధికారులు సంపూర్ణ సహకారం అందిస్తుండడంతో దోపిడీకి అడ్డుకట్ట పడలేదు. పట్టణాల్లో కొత్తగా వెలిసే వెంచర్‌లో అవసరమైన మట్టి గ్రావెల్ లాంటివి కూడా తామే సరఫరా చేస్తామంటూ హుకుం జారీ చేస్తున్నారు. పోలీసు స్టేషన్లల్లో సివిల్ పంచాయతీల నుంచి తుదకు చికెన్ వేస్టేజీ తరలింపులో కూడా మామూళ్లు కోరుతున్న వ్యవహారం తెరపైకి వస్తున్నాయని పరిశీలకులు వెల్లడిస్తున్నారు.

కడపలో రాయల్టీ చెల్లించకుండా..



వైఎస్సార్ కాలనీ, నానాపల్లె సమీపంలో కొండను తవ్వుతున్న జేసీబీ

జిల్లా కేంద్రమైన కడప నగరంలో మట్టి, గ్రావెల్ అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. టీడీపీ నాయకుల ధన దాహం వల్ల నానాపల్లె సమీపంలోని కొండలు, గుట్టలు కరిగిపోతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించకుండా సుమారు రెండు మాసాలుగా మట్టి, గ్రావెల్‌ను అక్రమ రవాణా చేస్తున్నారు. నానాపల్లె వద్ద 919/1 సర్వే నంబర్ నందు యానాది కొట్టాల వద్ద కాలభైరవ గడి వద్ద పాత కడపకు చెందిన టీడీపీ నేత కొండను తవ్వేసి చదును చేస్తున్నారు. ఆ మట్టిని ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకుంటూ మట్టి తీసిన స్థలాన్ని చదును చేసి ఆక్రమించుకోవాలని రంగం సిద్ధం చేశారు. ఇక ఎస్‌టీపీ రెండో లే ఔట్ పైన నానాపల్లె, వైఎస్సార్ కాలనీ సమీపాన ఎన్‌జీవో కాలనీకి చెందిన ఇరువురు టీడీపీ బ్రదర్స్ రెండు జేసీబీలతో గ్రావెల్ అక్రమ రవాణా సాగిస్తున్నారు. పగలు ఒకట్రెండు టిప్పర్లతో రాయల్టీ చెల్లించి, రాత్రివేళ పదుల సంఖ్యలో టిప్పర్లు ఏర్పాటు చేసి టన్నుల కొద్దీ మట్టిని మాయం చేస్తున్నారు.

జిల్లా హాకీ జట్ల ఎంపిక



సబ్ జూనియర్, జూనియర్ జిల్లా హాకీ జట్లకు ఎంపికైన క్రీడాకారులతో పీడీ, పీఈటీ తదితరులు

పులివెందుల టౌన్: పట్టణంలోని స్థానిక వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ హాకీ స్టేడియంలో ఆదివారం వైఎస్‌ఆర్ కడప జిల్లా సబ్ జూనియర్, జూనియర్ హాకీ జట్లకు క్రీడాకారులను ఎంపిక చేశారు. రిటైర్డు పీఈటీ కృష్ణమూర్తి, హాకీ సెక్రటరీ శేఖర్ ఎంపిక చేశారు. ఈ ఎంపికలకు 60మంది క్రీడాకారులు హాజరు కాగా.. మంచి ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో హాకీ కోచ్‌లు ఖాన్ బాషా, అనిల్ కుమార్, డేవిడ్ కుమార్ ఉదయ్ దీపు, శౌరి కుమార్, దినకర్, రవికుమార్, క్రీడాకారులు పాల్గొన్నారు.

10న అనంతపురం గంగమ్మ జాతర వేలంపాట

లక్కిరెడ్డిపల్లి: మండలంలోని అనంతపురం గ్రామంలో వెలసిన అనంతపురం గంగమ్మ దేవస్థానంలో ఫిబ్రవరి 28 నుంచి మార్చి 2వ తేదీ వరకు గంగమ్మ జాతర జరగనుంది. తలనీలాలు, కొబ్బరికాయలు, టోల్‌గేట్‌లు, ప్రతి ఆదివారం ఏడాదిపాటు ఆలయం ముందు కొబ్బరికాయలు, పూలదండలకు సంబంధించి వేలంపాటను ఈనెల 10వ తేదీ నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. వేలంపాటలో పాల్గొనేవారు ముందుగా రూ. 50 వేలు డిపాజిట్ చేయాలని తెలిపారు.వేలం దక్కించుకున్న తర్వాత సగం డబ్బులు, మిగతా డబ్బులు పదిరోజుల లోపు చెల్లించాలని పేర్కొన్నారు. అలాగే వేలం దక్కించుకోని వారికి తిరిగి రూ. 50 వేలు వెనక్కు ఇవ్వనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. వేలంపాటలో పాల్గొనే వారు ఈనెల 10వ తేదీ ఉదయం 10 గంటలలోపు గంగమ్మ ఆలయానికి రావాలని కోరారు.

రేషన్ షాపుల నోటిఫికేషన్‌పై హైకోర్టు స్టే

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప నగరంలో ప్రస్తుతం రేషన్ షాపులు నిర్వహిస్తున్న డీలర్లను తొలగించి టీడీపీ వారికి అప్పగించేందుకు అధికారులు చేసిన ప్రయత్నం బెడిసికొట్టింది. రెవెన్యూ అధికారులు ఇచ్చిన నోటిఫికేషన్‌పై హైకోర్టు స్టే ఇచ్చినట్లు తెలుస్తోంది. న్యాయస్థానం ఆదేశాలను ధిక్కరిస్తూ రెవెన్యూ అధికారులు ఆదివారం అయినప్పటికీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించడం గమనార్హం. నగరంలో మొత్తం 30 రేషన్ షాపులు ఉండగా ఇందులో 11 మంది హైకోర్టును ఆశ్రయించారు. తమ డీలర్ షిప్ తొలగిస్తే జీవనాధారం కోల్పోతామన్న బాధితుల వాదనలు విన్న న్యాయస్థానం స్టే ఇచ్చిందని.. ఈనెల ఆరు తర్వాత ఆ స్టే ను పొడిగించే అవకాశం ఉన్నట్లు కూడా సమాచారం .దీనిపై ఆర్డీఓ జాన్ ఇర్విన్‌ను అడగ్గా.. కోర్టు ఏం చెప్పిందో తమకు సమాచారం లేదని తెలిపారు. ప్రస్తుతం ఉన్న డీలర్లను తొలగించి టీడీపీ సానుభూతిపరులను ఆ స్థానంలో నియమించుకునేందుకు టీడీపీ నేతలు అధికారుల ద్వారా చేసిన ప్రయత్నాలు సత్ఫలితాన్ని ఇవ్వలేదని తాజా పరిణామాలను బట్టి తెలుస్తోంది.

7 నుంచి విద్యుత్ చార్జీలపై ప్రజాభిప్రాయ సేకరణ



మాట్లాడుతున్న ఏపీఎస్ పీడీసీఎల్ ఎస్ఈ రమణ

కడప కార్పొరేషన్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి అమలు చేయనున్న విద్యుత్ చార్జీల (టారిఫ్) ప్రతిపాదనలపై ఈనెల 7, 8, 10 తేదీలలో ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ రమణ తెలిపారు. ఆదివారం ఆయన తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. విద్యుత్ పంపిణీ సంస్థలు ఏపీ ఈఆర్‌సీకి సమర్పించిన వార్షిక ఆదాయ, అవసరాల నివేదిక (ఏఆర్‌ఆర్) పై 7, 8 తేదీల్లో విజయవాడ బృందావన్ కాలనీలో ఏ కన్వెన్షన్ సెంటర్లో, 10న కర్నూలు ఏపీఈఆర్‌సీ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు తమ అభ్యంతరాలు, అభిప్రాయాలు తెలియజేయవచ్చన్నారు. ఏపీ ఈఆర్‌సీ చైర్మన్ ఠాగూర్ రామ్‌సింగ్, ఏపీ ఈఆర్‌సి, ఇంధన శాఖ, ట్రాన్స్‌కో, జెన్కో, ఈపీడీసీఎల్, ఎస్పీడీసీఎల్, సీపీడీసీఎల్ అధికారులు అభిప్రాయ సేకరణలో పాల్గొంటారన్నారు.

ఆంగ్ల బోధనపై పట్టు సాధించాలి

రాయచోటి: ఆంగ్ల బోధనపై పట్టు సాధించేలా ప్రభుత్వ ఉపాధ్యాయులు శిక్షణ పొందాలని విల్‌టుకెఎన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీషు డైరెక్టర్ రామేశ్వర్ గౌడ్ అన్నారు. రాయచోటి ప్రభుత్వ డైట్ కళాశాల ఆడిటోరియంలో ఆదివారం జిల్లా కలెక్టర్, డీఈఓల సహకారంతో జిల్లా ఉపాధ్యాయులకు 40 రోజుల ఉచిత ఆన్‌లైన్ శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఒకరోజు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 200 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు హాజరయ్యారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థి తెలుగు మాట్లాడినట్లుగా ఇంగ్లీషు మాట్లాడేలా చేయాలన్న ప్రభుత్వ సంకల్పాన్ని విజయవంతంగా చేయాలని రామేశ్వర్ గౌండ్ అభిప్రాయపడ్డారు. ఇందులో భాగంగానే మొదట విశాఖపట్నం, అన్నమయ్య జిల్లాలోని జిల్లా విద్యాశాఖ సహకారంతో ఈ కార్యక్రమం అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రెవెన్యూ సదస్సులా.. టీడీపీ సభలా!

- వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వని అధికారులు
- కడప మేయర్, బద్వేలు ఎమ్మెల్యేను సైతం విస్మరించిన వైనం
- వేదికలపై టీడీపీ నాయకుల రాజకీయ ప్రసంగాలు



గోపవరం మండలంలో జరిగిన రెవెన్యూ సదస్సులో వేదికపై ఆశీనులైన టీడీపీ నేతలు (ఫైల్)

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో జరుగుతున్న రెవెన్యూ సదస్సులు అధికార తెలుగుదేశం పార్టీ రాజకీయ సభలుగా మారిపోయాయి. వైఎస్సార్ సీపీకి చెందిన స్థానిక ప్రజాప్రతినిధులకు అధికారులు కనీస సమాచారం కూడా ఇవ్వడం లేదు. కడప మేయర్ కె.సురేష్‌బాబు, బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధకు సైతం ఆహ్వానం లేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతుంది. ఆత్మస్తుతి-పరనింద ధోరణిలో టీడీపీ నాయకులు తమ రాజకీయ విమర్శలకు రెవెన్యూ సదస్సులను వేదికలుగా ఉపయోగించుకుంటున్నా అడ్డుచెప్పే అధికారులు కరువయ్యారు. పోనీ ఫిర్యాదుల పరిష్కారమైనా జరిగిందా అంటే అదీ నామమాత్రమే.

- భూ సంబంధమైన సమస్యలను పరిష్కరించేందుకంటూ గతనెల 6వ తేదీ నుంచి ప్రారంభించిన రెవెన్యూ సదస్సులు ఈనెల 8వ తేదీ ముగియనున్నాయి. ప్రతి గ్రామ పంచాయతీ, మున్సిపల్ డివిజన్లు, వార్డుల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నారు. స్థానిక సర్పంచులను మొదలు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఎంపీలకు సమాచారం అందించడం ద్వారా ఆర్డర్ ఆఫ్ ప్రొటోకాల్‌ను అమలు చేయాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉంది. కానీ వైఎస్సార్ సీపీకి చెందిన సర్పంచులు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు ఉన్నచోట వీఆర్వోలు, సమాచారమే ఇవ్వడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన బద్వేలు శాసనసభ్యురాలు డాక్టర్ దాసరి సుధకు అధికారులు సమాచారం ఇవ్వలేదని ఆ పార్టీ కార్యకర్తలు మండిపడుతున్నారు. బీసీ వర్గానికి చెందిన కడప నగర మేయర్ సురేష్‌బాబుకు ఇంతవరకు రెవెన్యూ సదస్సులపై అధికారులపై సమాచారం ఇవ్వలేదు. నగర ప్రథమ పౌరుడైన మేయర్‌కు రెవెన్యూ సదస్సుల సమాచారం ఇవ్వకపోవడం వెనుక టీడీపీ నేతల మౌఖిక ఆదేశాలే కారణమని తెలుస్తోంది. ఈ విషయంపై ఆదివారం కడప తహసీల్దార్ నారాయణరెడ్డిని వివరణ కోరగా 'సదస్సుల షెడ్యూల్ పంపించాం' అంటూ ముక్తసరిగా సమాధానమిచ్చారు. కడప నగరంలో ఒక డివిజన్ మినహా అన్నింటినీ వైఎస్సార్ సీపీ గెలుచుకుంది. ఫిరాయింపుదారులు పోగా ప్రస్తుతం 39 మంది కార్పొరేటర్లు ఉన్నారు. వీరిలో ఏ ఒక్కరికీ రెవెన్యూ సదస్సుల సమాచారాన్ని ఇవ్వలేదు. కార్పొరేటర్ అధ్యక్షతన జరగాల్సిన సదస్సుల్లో ఎలాంటి ప్రొటోకాల్ లేని టీడీపీ నేతలు వేదికలపై ఆశీనులవుతున్నారు. ఇది కడప నగరంలోనే కాదు...జిల్లా వ్యాప్తంగా ఇలాగే జరుగుతోంది. పైగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అనుచిత విమర్శలు చేస్తూ తమ అధినేత చంద్రబాబును ఆకాశానికి ఎత్తుతూ రాజకీయ ప్రసంగాలు చేస్తున్నారు. గతనెల 9వ తేది ప్రొద్దుటూరు మండలం దొరసానిపల్లె రెవెన్యూ సదస్సుకు హాజరైన జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత ఇలా రాజకీయ విమర్శలకు తెరతీశారు. ఇదే ధోరణి జిల్లావ్యాప్తంగా టీడీపీ నేతలు అమలు చేస్తున్నారు. దీంతో ప్రజల సమస్యలు మరుగున పడుతున్నాయి.

సమస్యల పరిష్కారం నామమాత్రం

భూములకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల సమస్యలను పరిష్కరిస్తామంటూ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు ప్రారంభించింది. సదస్సుల్లో ప్రధానంగా రికార్డు ఆఫ్ రైట్స్, సబ్ డివిజన్లు, రిజిస్ట్రేషన్లు, మ్యూటేషన్లు, సర్వే, ఆన్‌లైన్, భూ ఆక్రమణలు వంటి సమస్యలు వస్తున్నాయి. ఇప్పటివరకు నిర్వహించిన సదస్సుల ద్వారా సుమారు 10 వేలకు పైగా ఫిర్యాదులు అందాయి. ఇందులో కేవలం 400కు పైబడి మాత్రమే పరిష్కరించినట్లు అధికారుల నివేదికలు తెలియజేస్తున్నాయి. 1బీతో ఆధార్ సీడింగ్, డిజిటల్ సిగ్నేచర్ వంటి చిన్నచిన్న సమస్యలను మాత్రమే సదస్సుల్లో పరిష్కరిస్తున్నారు. సదస్సులు రాజకీయ వేదికలుగా మార్చిన రాష్ట్ర ప్రభుత్వానికి సమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధి లేదన్న విషయం దీని ద్వారా స్పష్టమవుతోంది.

రఫీగానం... ఆపాత మధురం



పాటలు పాడుతున్న గాయకులు

కడప కల్చరల్: అమర గాయకుడు మహమ్మద్ రఫీ గానం ఆపాత మధురమని గాయకులు కొనియాడారు. కడప నగరానికి చెందిన సరిగమ క్రియేషన్స్ సంస్థ ఆధ్వర్యంలో మహమ్మద్ రఫీ శత జయంతి ఉత్సవ కార్యక్రమాన్ని స్థానిక సంఘం ఫంక్షన్ ప్యాలెస్‌లో నిర్వహిచారు. ఈ సందర్భంగా గాయకులు ఎస్‌ఏ కలాం, ఆరీఫ్, షేక్ రఫీక్, గాయని షమ్మతో కలిసి మహమ్మద్ రఫీ పాడిన పాటలతో శ్రోతలను అలరించారు. పాత తరం హిందీ సినిమాల్లో మహమ్మద్ రఫీ పాడిన పాటలు శ్రోతలను ఉర్రూతలూగించాయి. తెలుగులో రఫీ పాడిన పాటలను స్థానిక గాయకులు ఆలపించగా, ఆయన అభిమానులు పదేపదే చప్పట్లతో తమ హర్షాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభకు డీసీసీ మాజీ అధ్యక్షుడు నజీర్ అహ్మద్ అధ్యక్షత వహించారు. స్థానిక ప్రముఖులు అమీర్‌బాబు, ఆరీఫుల్లా, సలావుద్దీన్, షా మహమ్మద్, అలీషేర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కుక్కల దాడిలో 15 గొర్రె పిల్లలు మృతి



కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రె పిల్లలు

పెండ్లిమర్రి : పెండ్లిమర్రి మండలం పగడాల పల్లె గ్రామంలో ఆదివారం కుక్కల దాడిలో 15 గొర్రె పిల్లలు మృతి చెందాయి. పగడాలపల్లె గ్రామానికి చెందిన కొంచాని చంద్రయ్య అనే గొర్రెల కాపరికి సంబంధించిన గొర్రె పిల్లలపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. దాడిలో 15 పిల్లలు చనిపోయాయి. దాదాపు రూ. 1లక్ష నష్టం జరిగినట్లు బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

పెన్నానదిలో పడి వృద్ధురాలు..

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక మోడంపల్లెకు చెందిన బెల్లంకొండ దస్తగిరమ్మ (68) పోట్లదుర్తి సమీపంలోని పెన్నానదిలో పడి మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మతిస్థిమితం సరిగా లేని దస్తగిరమ్మ ఇంటి నుంచి వెళ్లిపోవడంతో ఈ నెల 2న టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది. ఈ క్రమంలో ఆమె మృతదేహం పెన్నానదిలో కనిపించడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ పోలీసులు తెలిపారు.

నిజాయితీ చాటుకున్న మహిళా కండక్టర్



బాధితుడికి బ్యాగును అప్పగిస్తున్న కండక్టర్ గిరిజమ్మ, ఏఎస్ఐ వెంకటరమణ తదితరులు

మదనపల్లె : బస్సులోని ప్రయాణికుడు పోగొట్టుకున్న బంగారు చైనును మహిళా కండక్టర్ నిజాయితీతో బాధితుడికి అప్పగించి నిజాయితీ చాటుకున్న ఘటన ఆదివారం మదనపల్లెలో జరిగింది. తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం రంగంపేటకు చెందిన శివకుమార్ సొంత పనుల నిమిత్తం మదనపల్లెకు వచ్చారు. తిరిగి మదనపల్లెకు చెందిన ఆర్టీసీ బస్సులో రంగంపేటకు బయలుదేరి వెళ్లాడు. బస్సు దిగే క్రమంలో తన బ్యాగును బస్సులోనే మరచిపోయాడు. ఇంటికి వెళ్లాక బ్యాగు బస్సులో మరచిపోయినట్లు గుర్తించిన శివకుమార్ హుటాహుటిన తిరిగి మదనపల్లెకు వచ్చి టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటికే బస్సులో శివకుమార్ మరచిపోయిన బ్యాగును గుర్తించిన ఆర్టీసీ కండక్టర్ గిరిజమ్మ, అధికారులకు సమాచారం తెలిపి, టూటౌన్ పోలీసులకు బ్యాగును అప్పగించింది. అందులో రూ.2.50 లక్షల విలువ చేసే బంగారు చైను ఉండటంతో పోలీసులు బాధితుడికి సమాచారం అందించి స్టేషన్‌కు పిలిపించి, బ్యాగు, చైనును కండక్టర్ గిరిజమ్మతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా పోలీసు, ఆర్టీసీ అధికారులు కండక్టర్ గిరిజమ్మ నిజాయితీని అభినందించారు.

మార్కెట్‌కు రంగుల కళ

- సంక్రాంతి ముగ్గులకు సిద్ధమవుతున్న మహిళలు
- మార్కెట్‌లో అందుబాటులో రకరకాల రంగులు



మార్కెట్‌లో అందుబాటులో ఉన్న ముగ్గుల పుస్తకాలు



పలు రకాల రంగు పొడులు



రంగుల చాక్‌పీస్‌లు (సుద్దముక్కలు)

కడప కల్చరల్ : జిల్లాలో సంక్రాంతి సందడి మొదలైంది. ప్రత్యేకించి సంక్రాంతి పండుగకు ముగ్గుల పండుగగా పేరుంది. ధనుర్మాసం ప్రారంభమైనప్పటి నుంచి గ్రామాలు, పట్టణాల్లో ఇళ్ల ముందు కళ్లాపి చల్లి రంగురంగుల ముగ్గులు తీర్చిదిద్దడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ మహిళలు తెల్లవారుజామునే తమ ఇళ్ల ముందు మంచుముత్యాల్లాంటి తెల్లని ముగ్గుతో రంగవల్లులను తీరుస్తున్నారు. మరికొందరు ఓపిక చేసుకుని రంగులు కూడా వేస్తున్నారు.

రంగుల కళ

ప్రస్తుతం సంక్రాంతి పండుగ దగ్గర పడడంతో ముగ్గులు వేసే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. సోషల్ మీడియా విస్తృతం కావడంతో ముగ్గులపై మహిళలకు క్రేజ్ మరింతగా పెరిగింది. ఫలితంగా మార్కెట్లలో ముగ్గులు వేసేందుకు అవసరమైన రంగుపొడుల విక్రయాలు మొదలయ్యాయి. ముగ్గులు వేసేందుకు మహిళలు, యువతులు రంగుల ముగ్గు పొడులను ఇష్టంగా కొంటున్నారు. ముగ్గులు వేసే సీజన్ సంవత్సరంలో ఇదే గనుక తమ కళా ప్రతిభను ప్రదర్శించి రంగురంగుల ముగ్గులను తమ ఇంటి ముంగిళ్లలో తీర్చి ఇతరులను ఆకట్టుకునేందుకు ఎంతో కృషి చేస్తున్నారు. ముగ్గులు వేసేందుకు అవసరమైన ముగ్గుపొడి, రంగులను విక్రయించేందుకు కడప మార్కెట్‌లో దాదాపు 20కి పైగా దుకాణాలు వెలిశాయి. తెల్ల ముగ్గుపిండితోపాటు రంగులు కలిపిన ముగ్గుపిండికి కూడా డిమాండ్ ఏర్పడింది. అలాంటి ముగ్గుపిండి పావు కిలో రూ. 15 చొప్పున విక్రయిస్తున్నారు. కిలో రూ. 70 -80 లుగా విక్రయిస్తుండగా, ముగ్గుపిండి కలిపిన రంగుపొడి కిలో రూ. 50 కు విక్రయిస్తున్నారు. కేవలం తెల్లని ముగ్గుపిండి కిలో రూ.20-25లు ఉండగా, ఏడు రంగుల పెద్ద చాక్‌పీస్‌లు రూ. 25-30 లకు విక్రయిస్తున్నారు. రంగుపొడులు గల ఐదు చిన్న ప్యాకెట్ల కవర్ రూ.25-30 లకు, 20 చిన్నప్యాకెట్లు గల కవర్ రూ. 60లకు విక్రయిస్తున్నారు. కళ్లాపి చల్లేందుకు వినియోగించే పేడ రంగు ప్యాకెట్ రూ. 5-10 లకు అమ్ముతున్నారు. కడప నగరంలోని ప్రధాన కూరగాయల మార్కెట్‌లో ప్రత్యేకించి రంగుపొడులు అమ్మే దుకాణాలు వెలిశాయి.

ఖర్చయినా.. ఇష్టంగా..

ఓ మోస్తరు ముగ్గువేసి రంగులు నింపాలంటే కనీసం రూ. 50 నుంచి రూ. 100 రంగు పొడులు అవసరమవుతాయి. ముందే రంగులు కలిపిన ముగ్గపిండిని ప్రత్యేకంగా అమ్ముతున్నారు గనుక మహిళలు రంగులు కొనాల్సిన అవసరం లేకుండా పోతోంది. చాక్‌పీస్‌లతో చిన్నసైజు గీతల ముగ్గు వేయాలంటే కనీసం రూ. 20 ఖర్చు చేయాల్సి వస్తోంది. ఒక్కొక్క కట్టలో ఐదారు రకాల రంగుల చాక్‌పీసులు ఉంటాయి. ముగ్గులు వేయడం కంటే అందులో రంగులు నింపి తుది మెరుగులు దిద్దడానికే ఎక్కువ శ్రమపడాల్సి వస్తోంది. అయినా మహిళలు దీన్ని తమ ప్రతిష్టగా తీసుకుని ఇంటిలోని ఇతర మహిళలతో కలిసి తమ ఇళ్ల ముందు రంగులతో భారీ ముగ్గులను తీరుస్తున్నారు. ఏది ఏమైనా భోగి రోజుతోపాటు సంక్రాంతి రోజు కూడా ప్రతి ఇంటి ముందు రంగుల ముగ్గులు ఇంద్రధనస్సును తలపిస్తాయి.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



రామాంజనేయులు (ఫైల్)

పోరుమామిళ్ల : మండలంలోని దమ్మన్నపల్లెకు చెందిన తోట రామాంజనేయులు (44) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. కొండారెడ్డికి భార్య ముగ్గురు పిల్లలున్నారు. ఇద్దరు ఆడపిల్లలకు వివాహం చేసేందుకు రూ.5 లక్షలు అప్పు అయింది. కుమారునికి వివాహం కాలేదు. ఆయనకు ఎ.1-48 సెంట్లు పొలం ఉండగా అందులో వరి సాగు చేస్తున్నాడు. 5 ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేయగా రూ. 8 లక్షలు అప్పు అయింది. మొత్తం రూ. 13 లక్షలు తీర్చే దారి కనిపించక చనిపోవాలని భావించాడు. గత సంవత్సరం డిసెంబర్ 31న పురుగుల మందు తాగాడు. ఐదు రోజులుగా కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. ఈ సమాచారం ఆదివారం ఉదయం పోరుమామిళ్ల పోలీస్ స్టేషన్‌కు అందడంతో ఎస్ఐ కొండారెడ్డి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పార్టీ పదవులు అలంకారప్రాయం కాకూడదు

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్ రెడ్డిని సత్కరిస్తున్న పి. జయచంద్రారెడ్డి

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఇస్తున్న పదవులు అలంకారప్రాయం కాకూడదని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. ఆదివారం తనను జిల్లా అధికార ప్రతినిధిగా నియమించడం పట్ల పొట్టిపాటి జయచంద్రారెడ్డి ఆయనను సత్కరించారు. అనంతరం మేయర్ సురేష్ బాబును కూడా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవులు పొందిన వారు క్రమశిక్షణతో పార్టీ కోసం పనిచేయాలని సూచించారు. త్వరలోనే వారికి శిక్షణ కూడా ఉంటుందని తెలిపారు. అనంతరం జయచంద్రారెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకముంచి పదవి ఇచ్చిన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి, జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రామ్మోహన్‌రెడ్డి, మునిశేఖర్‌రెడ్డి, దాసరి శివప్రసాద్ పాల్గొన్నారు.

రాయలసీమ డిక్లరేషన్‌పై స్పందించాలి

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎం.ఎ. గఫూర్



మాట్లాడుతున్న ఎం.ఎ. గఫూర్

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: రాయలసీమ డిక్లరేషన్‌పై బీజేపీ ప్రజా ప్రతినిధులు స్పందించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎం.ఎ. గఫూర్ డిమాండ్ చేశారు. ఆదివారం కడపలో సీపీఎం 12వ జిల్లా మహాసభల సందర్భంగా సీతారాం ఏచూరి (అజ్మత్ ఫంక్షన్ హాల్) ప్రాంగణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాయలసీమలో ఉన్న బీజేపీ ఎమ్మెల్యేలు ఆదినారాయణ రెడ్డి, కర్నూలుకు చెందిన పార్థసారథి, మంత్రి సత్యకుమార్ రాయలసీమ డిక్లరేషన్ అమలు కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేసేలా ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి ప్రయత్నించాలన్నారు. సాగునీటి ప్రాజెక్టుల పూర్తి కోసం నిధులు తేవాలన్నారు. రాయలసీమ సమస్యలు పట్టించుకోకపోతే ప్రజలు క్షమించరన్నారు. భూస్వాములు లక్షలాది ఎకరాలను పేదలకు దక్కకుండా ఆక్రమించుకున్నారని, వాటిపై విచారణకు ఎందుకు ఆదేశించారని నిలదీశారు. వైఎస్ మరణం తరువాత సాగునీటి ప్రాజెక్టులపై జగన్, చంద్రబాబు నాయుడు శీతకన్ను వేశారని విమర్శించారు. రూ. 1500 కోట్లు కేటాయిస్తే బ్రహ్మంసాగర్ ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరు అందుతుందని పేర్కొన్నారు. మైలవరం ఆయకట్టు 90 వేల ఎకరాలకు కేవలం 15 నుంచి 20,000 ఎకరాలకు మాత్రమే సాగునీరు అందడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి, ఇరిగేషన్ మంత్రి పోలవరం జపమే తప్ప రాయలసీమ సమస్యలపై ఎందుకు మాట్లాడరని ప్రశ్నించారు. ఉమ్మడి వైఎస్సార్, అనంతపురం, కర్నూల్ జిల్లాల్లోని చెరువులకు నీరు నింపాలన్నారు. కుప్పం కెనాల్‌కు సిమెంట్ లైనింగ్ చేయడం మంచిదేనని, హంద్రీ-నీవా విస్తరణ పట్టదా అని అడిగారు కొప్పర్తి ఎంఎస్ఎంఈ సెంటర్‌ను, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని, నార్కోటిక్ డ్రగ్ లీగల్ కోర్టును తరలించే హక్కు ఎవరిచ్చారన్నారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ప్రభాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, కార్యదర్శివర్గ సభ్యులు రామమోహన్, మనోహర్, శివకుమార్ పాల్గొన్నారు.

రూ.26 వేల కోట్ల బకాయిలను చెల్లించాలి

రాయచోటి అర్బన్ : రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లిం రూ.26వేల కోట్ల పెండింగ్ బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్‌టీయూ) రాష్ట్ర సంయుక్త అధ్యక్షుడు సుబ్రమణ్యంరాజు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని సాయి ఇంజినీరింగ్ కళాశాల సభా భవనంలో ఎస్‌టీయూ అన్నమయ్య జిల్లా శాఖ 78వ వార్షిక కౌన్సిల్ సమా వేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ వద్ద దాచుకున్న సొమ్మును పాలకులు ఖర్చు చేసేసి తిరిగి చెల్లించకుండా మొండి చేయి చూపిస్తుండడం దారుణమన్నారు. పలుమార్లు విన్నవించుకున్నా బకాయిల చెల్లింపునకు ప్రభుత్వం ముందుకు రాకపోవడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు బాల గంగిరెడ్డి, ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. పలురకాల యాప్‌ల నిర్వహణ భారంతో ఉపాధ్యాయులు బోధనకు దూరమై పాఠశాలల్లో ఆశించిన ఫలితాలు రావడం లేదన్నారు. ఎస్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శివారెడ్డి, పోకల మధుసూదన్ మాట్లాడుతూ బదిలీ చట్టం పారదర్శకంగా రూపొందించాలన్నారు.

కార్పొరేట్‌లకు కట్టబెట్టేందుకే ఏపీఎండీసీలో టెండర్లు

రాయచోటి అర్బన్ : ఏపీఎండీసీని కార్పొరేట్ కంపెనీకి కట్టబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు ఆరోపించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏపీఎండీసీలో రూ.5వేల కోట్లు సేకరించేందుకు అడ్వైజర్ కం మర్చంట్ బ్యాంకర్ కమిటీ ఏర్పాటు చేస్తూ జీఓ నంబర్ 97ను విడుదల చేసిందన్నారు. ఈ కమిటీ ఇచ్చిన ఈ ప్రొక్యూర్‌మెంట్ టెండర్‌ను పరిశీలిస్తే రూ.5వేల కోట్లు సేకరించేందుకు బదులుగా రూ. 500 కోట్ల నష్టం వాటిల్లే విధంగా ఉందన్నారు. సీ,డీ,డబ్ల్యు ఖనిజం రూ.1680కు ఎగుమతి అవుతుంటే ప్రస్తుతం పిలిచిన టెండర్లలో రూ. 1188కే అమ్మేందుకు నిర్ణయించడం దారుణమని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

బాకీ డబ్బు ఇవ్వలేదని ఇంటికి తాళం



ఇంటి ముందు కూర్చున్న చంద్రలీల

ప్రొద్దుటూరు క్రైం : బాకీ డబ్బు ఇవ్వలేదనే కారణంతో ఇంటికి తాళం వేసిన ఘటన ఆదివారం సాయంత్రం ప్రొద్దుటూరులో చోటు చేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఈశ్వరరెడ్డినగర్‌కు చెందిన శ్రీపతి చంద్రలీల కడపలోని సచివాలయంలో పని చేస్తోంది. ఆమె భర్త మదన్‌మోహన్ బాబు మెడికల్ షాపు నిర్వహించేవాడు. భార్యకు తెలియకుండా అతను అప్పులు చేసి ఇల్లు వదలి ఎక్కడికో వెళ్లిపోయాడు. మదన్‌మోహన్‌బాబు తన ఇంటి కాగితాలను పెట్టి సుబ్బారెడ్డి అనే వ్యక్తి వద్ద నుంచి రూ. 2.50 లక్షలు అప్పు తీసుకున్నాడు. బాకీ విషయమై అతను చంద్రలీలకు చెప్పగా భర్త చేసిన అప్పుతో తనకు సంబంధం లేదని చెప్పింది. ఆదివారం చంద్రలీల భోజనానికి తన అమ్మగారింటికి వెళ్లింది. తన ఇంటి గేటుకు సుబ్బారెడ్డి అనే వ్యక్తి తాళం వేశాడని వీధిలో వాళ్లు ఫోన్ చేసి చెప్పడంతో ఆమె వెంటనే ఇంటికి వచ్చింది. దీంతో చంద్రలీల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంజీవరెడ్డి తెలిపారు.

అనకాపల్లి సరే.. కడప ఉక్కు మాటేమిటి?

సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న గాలి చంద్ర

జమ్మలమడుగు : అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద అర్సెలర్ మిట్టల్-నిప్పన్ స్టీల్ ఇండియా ఉమ్మడిగా రూ.1,47,162 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న ఉక్కు ఫ్యాక్టరీకి కావాల్సిన అనుమతులు, కేటాయింపులకు ఉపక్రమించిన కూటమి ప్రభుత్వం కడప ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణంపై స్పష్టమైన ప్రకటన విడుదల చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎస్సీ డిగ్రీ కాలేజిలో సీపీఐ నియోజకవర్గ కార్యకర్తల సమావేశం కార్యదర్శి ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2007 జూన్ 10వతేదీన స్టీల్‌ప్లాంట్‌కు శంకుస్థాపన చేశారన్నారు. ఆయన మరణానంతరం 2014లో రాష్ట్ర విభజన జరిగాక కడపలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని కేంద్ర ప్రభుత్వం విభజన చట్టంలో హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. 2014లో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ నిర్మాణంపై శ్రద్ధ చూపలేదన్నారు. స్టీల్‌ప్లాంట్ నిర్మాణం కోసం గతంలో నాటి రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారన్నారు. ఇప్పుడు ఆయన అనకాపల్లి ఎంపీగా ఆ ప్రాంత వాసులకు మేలు చేకూర్చే ప్రయత్నం చేస్తున్నారని, అలాగే కడప జిల్లాలో కూడా ఉక్కు ఫ్యాక్టరీ కోసం కృషి చేసి జిల్లా వాసుల చిరకాల వాంఛ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి సుబ్బారెడ్డి, నారాయణ, మనోహర్‌బాబు, లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

పెళ్లి చేయలేదని యువకుడి ఆత్మహత్య

ములకలచెరువు : మండలంలోని పర్తికోట పంచాయతీ మావిళ్లవారిపల్లెకు చెందిన వసంత్ కుమార్ కుమారుడు వినోద్ కుమార్(27) తనకు కుటుంబ సభ్యులు త్వరగా పెళ్లి చేయలేదని ఈ నెల 2వ తేదీ గురువారం గుళికల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆదివారం పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

యంత్రాలు మూలన.. రైతులకు యాతన

- తుప్పపడుతున్న టమాటా గ్రేడింగ్ యంత్రాలు
- అన్నమయ్య జిల్లాలోని మూడు మార్కెట్ యార్డుల్లో రూ.1.08 కోట్లతో ఏర్పాటు
- వినియోగిస్తే రైతులకు ఎంతో మేలు



గ్రేడింగ్ యంత్రాలను ప్రారంభిస్తున్న మార్కెటింగ్ శాఖ అధికారులు(ఫైల్ ఫొటో)





గుర్రంకొండ మార్కెట్‌యార్డులో తుప్పపడుతున్న టమాటా గ్రేడింగ్ యంత్రాలు

గుర్రంకొండ : టమాటా రైతుల కోసం గత ప్రభుత్వం మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన గ్రేడింగ్ యంత్రాలు వినియోగించకపోవడంతో తుప్పు పడుతున్నాయి. జిల్లాలో మూడు మార్కెట్‌యార్డుల్లో రూ.1,08 కోట్లతో టమాటా గ్రేడింగ్ యంత్రాలను ఏర్పాటు చేశారు. వీటిని ఏడాదిగా వినియోగించకపోవడంతో తుప్పుపడుతున్నాయి. నాణ్యమైన టమాటాలను విభజించే గ్రేడింగ్ యంత్రాలను వినియోగంలోకి తెస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుంది.

రెండేళ్ల క్రితం రూ.1.08 కోట్లతో ఏర్పాటు

రెండేళ్ల క్రితం జిల్లాలో గత ప్రభుత్వం మదనపల్లె, గుర్రంకొండ, కలికిరి మార్కెట్ యార్డులో తొలిసారిగా మార్కెటింగ్ శాఖ తరఫున గ్రేడింగ్ యంత్రాలు ఏర్పాటు చేసింది. అప్పట్లో ప్రభుత్వం ఆగ్రో సంస్థ సౌజన్యంతో ఒక్కొక్కటి రూ. 36 లక్షలు విలువచేసే గ్రేడింగ్ యంత్రాలను మూడు మార్కెట్ యార్డుల్లో ఏర్పాటు చేశారు. 2023 మార్చి14 తేదీ నుంచి మూడు మార్కెట్ యార్డుల్లో వీటిని ప్రారంభించారు. మార్కెట్ యార్డులోని రెండు గదుల్లో యంత్రాలను అమర్చి అక్కడ విద్యుత్‌తో పాటు అన్ని సౌకర్యాలను అప్పట్లో ఏర్పాటు చేశారు. యంత్రాలతో పాటు గ్రేడింగ్ చేసిన టమాటా క్రేట్‌లను లోడింగ్ చేసేందుకు క్రేన్‌లను కూడా మూడు చోట్ల ఏర్పాటు చేశారు. అప్పట్లో రాష్ట్ర మార్కెటింగ్ శాఖ కమిషనర్, రాయలసీమ జేడీల చేతుల మీదుగా వీటికి ప్రారంభోత్సవం నిర్వహించారు.

రైతులకు, వ్యాపారులకు ఉపయోగకరం

టమాటా గ్రేడింగ్ యంత్రాలతో రైతులకు, వ్యాపారులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేది. పొలాల నుంచి టమాటాలను తీసుకొచ్చే రైతులు, రైతుల దగ్గర వ్యాపారులు కొనుగోలు చేసే టమాటాలను ఈ యంత్రాల్లో వేస్తే మూడు రకాలుగా టమాటాలు గ్రేడింగ్ అవుతాయి. ఈ యంత్రాల్లో అమర్చిన ఆధునిక పద్ధతి ద్వారా ఏ,బీ, సీ గ్రేడ్లుగా టమాటాలు విడిపోతాయి. తద్వారా రైతులతో పాటు వ్యాపారులకు ధరలు నిర్ణయించడానికి సులభతరంగా ఉంటుంది. గతంలో రైతులు తీసుకొచ్చే టమాటాలను వేలం పాటల్లో వ్యాపారులు కొనుగోలు చేసి వాటిని కూలీల ద్వారా ఏ,బీ,సీ గ్రేడ్లుగా విభజించేవారు.

ఒక క్రేట్‌కు 50 పైసలే ఖర్చు

రైతులు గానీ, వ్యాపారులు గానీ గ్రేడింగ్ యంత్రాల్లో టమాటాలు గ్రేడింగ్ చేసుకొనేందుకు అప్పట్లో ప్రభుత్వం ఒక క్రేట్(25 కేజీలు)కు 50 పైసలే అద్దె లేదా ఫీజుగా వసూలు చేసింది. మార్కెటింగ్ శాఖ ఆదేశాల మేరకు అతి తక్కువ ధరలకే వీటిని వినియోగించే విధంగా అప్పట్లో చర్యలు చేపట్టారు. వ్యాపారులు రైతుల దగ్గర టమాటాలు కొనుగోలు చేసి బయట ప్రాంతాలకు తరలించాలంటే ముందుగా టమాటాలను మూడు గ్రేడ్‌లుగా విభజించేవారు. ఇందుకోసం ప్రత్యేకంగా కూలీలను నియమించుకొనేవారు. ఇందుకోసం ఒక్కో కూలీకి రూ.800 నుంచి రూ.1000 వరకు చెల్లించేవారు. దీంతో టమాటాల గ్రేడింగ్ భారం ఎక్కువ మొత్తంలో వ్యాపారులపై పడేది. అదే గ్రేడింగ్ యంత్రాలు ఏర్పాటు చేసిన తరువాత అందులో 10 శాతం ఖర్చుతోనే టమాటాల గ్రేడింగ్‌తో పాటు గ్రేడింగ్ చేసిన టమాటా క్రేట్‌లను క్రేన్‌ల ద్వారా లోడింగ్ చేసే ప్రక్రియ ముగిసేది. దీంతో వ్యాపారులకు ఎంతో డబ్బులు ఆదా అయ్యేవి.

తుప్పుపడుతున్న యంత్రాలు

రెండేళ్ల క్రితం ఏర్పాటు చేసిన గ్రేడింగ్ యంత్రాలు ప్రస్తుతం వినియోగించకపోవడంతో తుప్పపట్టిపోతున్నాయి. ఏడాదిపాటు వీటిని వినియోగించారు. ఆ తరువాత వీటిని అనివార్య కారణాలతో వినియోగించడం నిలిపివేశారు. అప్పటి నుంచి వీటిని వినియోగించక పోవడంతో మార్కెట్‌యార్డు గదుల్లో మూలనపడ్డాయి. వీటితోపాటు చిన్నపాటి యంత్రాలు, పరికరాలు తుప్పు పట్టి నిరుపయోగంగా మారాయి. కొన్నిచోట్ల యంత్రాలకు అమర్చిన పరికరాలు చోరీకి గురయ్యాయి. మూడు మార్కెట్ యార్డుల్లో రూ.1.08 కోట్లతో ఏర్పాటు చేసిన యంత్రాలతోపాటు వీటి నిర్వహణ కోసం చేసిన అదనపు ఏర్పాట్లకు చేసిన ఖర్చు వృథాగా మారిపోయింది. వీటి ఆలనా పాలనా చూసేవారు లేకపోవడంతో మార్కెట్ యార్డుల్లో దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. అధికారులు చొరవ చూపి వీటిని వినియోగంలోకి తెస్తే రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది.


నిర్వహణ పట్టించుకోవడం లేదు



మార్కెట్ యార్డుల్లో గ్రేడింగ్ యంత్రాల నిర్వహణ అధికారులు పట్టించుకోవడం లేదు. రెండేళ్ల క్రితం ఈయంత్రాలను మార్కెట్ యార్డులోని ఓ గదిలో ఏర్పాటు చేశారు. కొద్దిరోజులపాటు వీటిని వినియోగించారు. వీటితో రైతులకు ఎంతో మేలు జరిగింది. ఆ తర్వాత కాలంలో వీటి నిర్వహణను అధికారులు పట్టించుకోవడం మానేశారు. గ్రేడింగ్ యంత్రాలు యార్డుల్లో ఓ మూలనపడి చెదలు పట్టిపోతున్నాయి.

\- గయాజ్ అహ్మద్, గుర్రంకొండ

లోపాలను సరిదిద్దాల్సి ఉంది



మార్కెట్ యార్డుల్లో రెండేళ్ల క్రితం ఏర్పాటు చేసిన గ్రేడింగ్ యంత్రాల్లో కొన్ని లోపాలు ఉన్నాయి. దీంతో వాటిని వినియోగించడం మానేశాము. ఏడాది క్రితం మార్కెటింగ్ శాఖ నుంచి కొంతమంది మెకానిక్‌లు వచ్చి లోపాలను పరిశీలించి వెళ్లారు. లోపాలను సరిచేసి మళ్లీ వినియోగంలోకి తీసుకొస్తాము.

\- కుమార్‌రెడ్డి, మార్కెట్ కమిటీ కార్యదర్శి వాల్మీకిపురం, కలికిరి